ఈనాడు తమిళనాడు

మంగళవారం 20 నవంబరు 2018 9

# వృద్ధురాలికి అరుదైన చికిత్స

**టీనగర్, న్యూస్‌టుడే:** హృద్రోగ సమస్యతో బాధపడుతున్న 79 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన చికిత్స చేసినట్లు నగరంలోని ఎస్‌ఆర్‌ఎంసీ (శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్) ప్రకటించింది. నగరానికి చెందిన ఆ వృద్ధురాలు మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలతో బాధపడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆమె గుండె ధమనుల్లో సమస్య తలెత్తడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నట్లు గుర్తించామని వైద్యులు పేర్కొన్నారు. ఆమెకు ఒకే సమయంలో వాల్వ్, అరోటిక్ భాగాలను తొలగించాల్సిన అవశ్యకత ఉందని గుర్తించారు. వయస్సు మించిన కారణంగా ఆమెకు శస్త్ర చికిత్స చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. డాక్టర్ మురళీధరన్, నాగేంద్ర భూపతి, వినోద్‌కుమార్, పెరియసామి, రంజిత్‌లతో కూడిన ఓ ప్రత్యేక బృందం ఈ చికిత్సను విజయవంతంగా చేసిందన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రోగి తొడ భాగంలో రంధ్రం చేసి తద్వారా గుండె ధమనులలోని అడ్డును తొలగించామన్నారు. అదే సమయంలో కొత్త వాల్వ్‌ను పొందుపరిచినట్లు తెలిపారు. ఏక కాలంలో ఈ రెండింటిని నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, మరో రెండు రోజుల్లో వైద్యశాల నుంచి క్షేమంగా ఇంటికి వెళ్తారని వైద్యులు వివరించారు. దక్షిణ భారత దేశంలో ఈ చికిత్స చేయడం ఇదే ప్రథమమన్నారు.



చికిత్స గురించి వివరిస్తున్న వైద్యులు